# వక్షోజ్వాల

సమాజం చేసిన పైశాచిక నృత్యం తాలూకు శిధిల చిత్రం అక్కడపడి వుంది. అదో శవం !

నగ్నంగా, నున్నగా వున్న ఆమె శవం !!

జీర్ణించి పోయిన పరిసరాలు, ఏం జరుగుతున్నా నిటారుగా నిలబడి చూసే దూరాన వున్న తాటి చెట్లు - అప్పుడప్పుడు ఆత్మ హత్యలకు మాత్రం ఉపయోగ పడుతున్న కాలువ - ఏమి చేయలేని స్థితిలో అతి పేలవంగా ఆకాశంలో వున్న ఉదయపు చంద్రుడు - నిత్య నైమిత్తికాల తాలూకు చెత్తా చెదారం - ఇవన్నీ అల్లంత దూరంలో ఉండి చూస్తే నిశ్చలంగా కనిపించే పతన దృశ్యాలు! వీటికి చైతన్యం లేదు, తెలియదు. అలా మూగగా మౌనంగా ఉండటమే తెలుసు. ఈ జీర్ణించుకు పోయిన దృశ్యాలలో ఇమిడిపోయిన విషయం ఆ కళేబరం. అలా చూస్తే ఆ చిత్రం మొత్తం ఒక వ్యవస్థకు వ్యాఖ్యానంలా కనబడుతుంది.

ఆమె - ఆ ఊళ్ళోనే ఒకప్పుడు 'బ్రతికిన శవం' - ఇప్పుడు స్వేచ్ఛ పొందిన 'జీవితం' గత రాత్రిలో కలిసిపోయిన ఆమె, ఈ ఉదయాని కేమీ మిగిలి లేదు.

ఆమెను ఆ స్థితిలో ప్రథమంగా చూసిన వాళ్ళెవరో కాని ఊళ్ళో అందరికీ తెలిసిపోయింది. గ్రామ పెద్దలనబడే వాళ్ళందరూ వచ్చారు. దొరలూ, దాతలూ, సేట్లూ, పటేళ్ళూ శవాన్ని చూశారు. పోల్చుకున్నారు. బ్రతికుండగా ఆమెకు చేసిన తమ అన్యాయాలను నెమరువేసుకున్నారు. ఎవరికీ తెలియదని తప్పుకున్నారు. ఆమె అందరికీ తెలిసినా తెలియని కిందే లెక్క. ఎవరికి వారు ఆమె ఎవరని, ఆమె గత చరిత్ర ఏమిటని, ఎదుటి వాళ్ళను ఆరా తీసారు. ఒక్కో విషయంలో ప్రత్యేకంగా ఆమెతో వున్న సంబంధాన్ని గూర్చి చెప్పుకో లేని పిరికి పందలు. ఆమె తన నిజస్థితిని ప్రపంచానికి చాటడానికే అలా అయిన ధైర్యవంతురాలు.

కొందరు ఆమెగురించి రకరకాల వ్యాఖ్యానాలు, కథలు అల్లుతున్నారు. బ్రతికి వుండగా చాటు చాటుగా చెప్పుకునే వాళ్ళు. ఇప్పుడు ఆమె వినలేదన్న ధైర్యంతో ముసిగా కసిగా నవ్వుతూ చెప్పుకుంటున్నారు.

తమ అవసరాలు తీర్చినందుకు ఆమెను మెచ్చుకుని, గర్వంగా లోలోన నవ్వుకుంటూ పైకి సంతాపం నటించారు. కొంతమంది, అలగా జనంలోని కొందరు ఆమె మంచి తనాన్ని తలుచుకున్నారు. బ్రతికున్న ప్రాణి మంచి తనాన్ని ఎవరూ మెచ్చుకోలేరేమో.

ఇంక ఆమె బ్రతికిరాదు. అందుకు మనస్ఫూర్తిగా విచారించే వాళ్ళు లేరు. రోజులు గడుస్తున్న కొద్దీ .... ఒకరి కెవరికో కాదు, కనీసం తనకు తానే అవసరం లేదని గ్రహించిన ఆమెగత రాత్రి తనకు తానే న్యాయం చేకూర్చు కుంది. ఊరి బయట ఆత్మహత్యలకు అనువైన చోట .... ఎవతోనో విసిరి వేయబడి వుంది. దొంగలు నగలు దోచుకుని ఖాళీ పెట్టెల్ని ఎక్కడో పారేసి నట్లు .... ఆ శవం.

ఏ కొద్ది భాగమో బట్ట చుట్టి వున్నా, శవం నగ్నంగా వుందనే చెప్పాల్సి వస్తోంది. పెద్ద మనుషులు తమ కుళ్ళును బయట పెట్టుకోలేరు. ఆమె మాత్రం బ్రతికున్నా, చచ్చిన తన నిజాన్ని వాళ్ళ ముందుంచుతూనే వుంది. తెల్లని శరీరం, సన్నని ముక్కు, చిన్న మూతి, పొందికైన గడుమ - అలాగే పోతే యవ్వనం నాట్యం చేసుకోగల గుండెలు ....

"గిప్పుడు సూశెటందుకు బాగానే వుంది. రేపటికి మురిగి కంపుగొడ్తది. మనల్ని ఈ బాటెమ్మటి నడ్వ నియ్యదు" - అన్నాడో జీవి.

"అవు మల్ల - సచ్చిన పీనుగ కాదే. మురిగి మురిగి కంపు ఆసన ఊరు ఊరంత లేస్తది. ఎట్లన్న జేసి కాలెయ్యాలె"

అయితే శవాన్ని ఎలా కాల్చాలి? కాల్చడం తేలిక కాదు. అక్కడివాళ్ళ అందరిలో తమ డబ్బెక్కడ ఖర్చు పెట్టాల్సి వస్తుందో నని భయం. శవం దగ్గర కాల్చడానికి సరిపడే ఆస్తిలేదు. ఆమె శవం కాల్చడానికి ఎవరు పెట్టు బడి పెట్టాలి? - అనే చర్చ సాగుతూంది. ఒకప్పుడు ఆమెను కాల్చడానికి చాలా మంది వదులూ వందలూ ముందుకు తెచ్చేవారు. రాను రాను ఏవీ ముందుకు తేకుండానే మోసం చేసేవారు. కాల్చడం అక్కర్లేనప్పుడు ఇప్పుడు ఒక్కరూ ముందుకు రావడంలేదు. ఎందుకూ? అవసరం తీరిపోయింది గనుక! అవసరం లేదు గనక! ఎవరికీ అవసరం రాదు గనక!

"ఊళ్ళో చందాలు వసూలు చేద్దాం" - సలహా యిచ్చు కున్నారు ఒకరి కొకరు.

"సరే ఎలాగయినా ఈ శవాన్ని స్మశానానికి చేరుద్దాం. తరువాత విషయం ఆలోచిద్దాం" —అనుకున్నారు.

కొందరు మనుషులు పొట్టకూలికి కోసం అటునుండి వెళుతూ వుండడం చూశారు పెద్దలు. "అరేయ్ ఇట్రాండి - గీ పీనగను కాష్టాల గడ్డకు తీస్కపోండ్రి" ఆజ్ఞాపించాడు వూరి పెద్దల్లో పెద్దమనిషి.

"అయ్య మంచిదయ్య గులా పోల్లం"—చేతులు జోడించుకుని చెప్పిన పని చేయసాగారు. ఆ శవాన్ని లేపి భుజాలమీద వేసుకుని నడుస్తున్నారు.

ముందు మనుషులు - వెనక 'శవాలు'!!

* * *

అదే వూళ్ళో అదే సమయంలో ఒక పెద్ద నాలుగు రోడ్ల కూడలి దగ్గర మరో శవం ఊరేగుతూంది. మనుషుల్లో అంతస్తుల్లాగా శవాల్లో కూడా విభేదాలు. ఒకటి నిశ్శబ్దంగా ఊరేగితే, మరొకటి శబ్దాలతో ఊరేగుతోంది. ఎలా ఊరేగినా ఫలితం మన్నేనని అందరికీ తెలుసు. ఊరి మధ్యలో ఘనంగా ఊరేగేది ఒక

పెద్ద ధనవంతుడి శవం! అందుకే పూలు, బాజా భజంత్రీలు, చావు నృత్యం అట్టహాసం ....

అప్రయోజకుడైన తన కొడుక్కు కాక, ఆస్తినంత తన కూతుళ్ళకు తమ్ముళ్ళకు యిచ్చివేసే ప్రయత్నం పూర్తికాక ముందే ఓ శుభసమయంలో ఆ ధనవంతుడు చనిపోయాడన్న వార్త ఒకరికొకరుగా వూరంతా తెలిసిపోయింది. చాలా రోజులుగా ఆ ధనవంతుడు అనారోగ్యంతో ఉన్నాడు. అందరూ ఎప్పుడు పోతాడు ఈ ముసలాడు అనుకుంటూ వుండేవారు. ఆ రాత్రి చచ్చిపోయాడని తెలియగానే 'హమ్మయ్య' అని మనసులో సంతోషించారు.

అస్థి చేజిక్కించుకోవాలనే ఆశతో కుండలో నిప్పు పట్టుకుని ముందు నడుస్తున్నాడు సుపుత్రుడు. వెనుక బంధువులు, స్నేహితులు పరిచయస్తులు నడుస్తున్నారు. అతను సంపాదించిన మిద్దెలు మేడలు బంగారం, డబ్బు వగైరాలు నడవడం లేదు.

ఊళ్ళోని ఇళ్ళన్నీ దాటి బయటి ప్రదేశానికి రాగానే ఉన్నట్టుండి అంతలోకే ధనవంతుడి శవం కదిలింది. కదలడమే కాదు, కళ్ళు కూడా తెరిచింది.... తెరవడమే కాదు. అరిచింది.... అరవడమే కాదు, లేచి కూర్చుంది. అందరు నిర్ఘాంత పొయ్యారు. భయం వణుకు పుట్టింది. మోస్తున్న వారు పాడెను క్రిందికి దింపారు. కొందరు పరుగు లంఘించుకున్నారు. కొడుకు ఆశ్చర్య పోలేదు. పావం, నాటు వైద్యుడు పరుగు దీసాడు. తండ్రి చావక ముందే స్మశానానికి చేర్చే ప్రయత్నం కొడుకు, నాటు వైద్యుడు కలిసి చేసారు. అంత తొందరగా ఆస్థినంతా వదలి వెళ్ళిపోవడం యిష్టం లేని ముసలి ధనవంతుడు కొడుకును పరీక్ష చేయడం అయిపోయింది....రంగులు వెలిసిపొయ్యాయి.

హత్యా ప్రయత్నం విఫలమైందని కాదు - శవం బ్రతికిందని ఊరంతా పాకింది. తన చావు వైభవాన్ని కళ్ళారా చూసుకున్న ముసలాడి నవ్వులోంచి వేదాంతం తొలికింది.

* * *

ఇక్కడ చితికన్నా గొయ్యి త్రవ్వితే ఖర్చు తక్కువౌతుందని ఆమె శవం కోసం గొయ్యి సిద్ధం చేస్తున్నారు. కొంత వరకు త్రవ్వడం కాగానే

'స్మశానం వైపు తీసుకొస్తున్న ధనవంతుడి శవం లేచిందని. అతని కోసం పేర్చబడి వున్న చితి దగ్గర్లోనే వుందని, శవం బ్రతికింది గనక చితిని వూరికే కాలేస్తారని' ఎవరో వార్త నందించారు.

అతగాడి చితిని ఊరికే కాలేస్తారు గనక, అందులో ఈమె శవాన్ని వేసి కాల్చొచ్చని - మరొకరు సలహా నిచ్చారు. చేతి నుండి డబ్బు ఖర్చు కాకుండా తయారుగా ఉన్న చితి దొరికినందుకు ఎవరికి వారు సంతోషపడి అందరూ ఆ సలహా పాటించ వచ్చని అనుకున్నారు.

ఆమె శవాన్ని చితి వరకు మళ్ళీ మోయించుకు వెళ్ళారు. అక్కడ దాన్ని చితిపై వుంచి, పైన కట్టెలు పేర్చి అంటించారు. అంటుకోలేదు. కిరసనాయిలు తెప్పించి, చల్లి, మళ్ళీ మళ్ళీ అంటించారు. అయినా అంటుకో లేదు!

అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఉండి ఉండి ఒక్క సారిగా ఆ శవం వక్షోజాల నుండి మంటలు లేచాయి మంటలు క్రమంగా చితి మొత్తం వ్యాపించ లేదు. కేవలం అక్కడే-అక్కడే నిలిచి పోయ్యాయి. రంగు రంగులుగా ఆ మంటలు - ఎందరో మనుషల్లాగ....ఎన్నో మంటలు, వక్షోజాల్ని నలిపేస్తూ కాల్చేస్తున్నాయి.

"నన్ను యిక్కడే - ఈ వక్షోజాల్నించే మీరు పూర్తిగా కాల్చివేశారు. నన్నీ మంటలేమీ చేయ లేవు. నేనెప్పుడో కాలిపోయ్యాను" - అన్నట్లు జ్వాలల కాంతుల్లో ఆమె ముఖం మీది చావు కళ మెరిసిపోతోంది.

ఈ మంటల ఒక్కొక్క రంగు, మీలోని ఒక్కొక్కరికీ ప్రతినిధి. మిమ్మల్ని మీరు గుర్తుపట్టలేక పోతున్నారు. అయినా ఎవర్ని వారు గుర్తు పట్టు కుంటే ఈ లోకం ఇలా ఎండుకుంటుంది? అవసరాలు తీర్చుకున్న మీరు, ఇప్పుడు నన్ను అసహ్యించు కుంటున్నారు. కానీ యింతయినా మీరంతా బాగుపడే దెప్పుడని? మీ మూర్ఖత్వాన్ని, పిరికి తనాన్ని చూసి జాలితప్ప ద్వేషం లేదు నాకు - అన్నట్లు శవం ముఖం చిట్లించ కుండా ప్రశాంతగానే వుంది.

శవం పూర్తిగా కాలడం లేదు. కేవలం వక్షోజాలే జ్వలిస్తున్నాయి. ఆ పెద్దమనుషులకేమి అర్థం కాలేదు. ఏదో మాయ వుందనుకున్నారు. అక్కడ వుండటం తమకు ప్రమాదకర మనుకుని ఊళ్ళోకి పరుగు తీసారు.

ఊళ్ళోకి తిరిగొచ్చిన పెద్ద మనుషులు ధనికుడి కొడుకుతోసహా ఒక చోట .... రచ్చబండపై కూర్చున్నారు. ఆనాడు జరిగిన రెండు వింత సంఘటనలను గూర్చి కొందరు అనుమానాలను వెలిబుచ్చారు. సందేహ నివృత్తి చేయ యత్నించారు. మరి కొందరేవేవో సలహా లిచ్చారు. ఊరి బాగుకోసం పూజలు చేయాలన్నారు.

ఒక శవం మళ్ళీ బ్రతికింది. మరో శవం ఎంత కాల్చినా పూర్తిగా కాలలేదు. మంటల్లో రంగులు కనిపించాయి - అంటే గ్రామాని కేదో అరిష్టం చుట్టుకుంది. ఇలా చూస్తూ వూరుకుంటే లాభం లేదు - తీర్మానించు కున్నారు. ఈ నమ్మకాలన్నీ మూఢమైనవని వారనుకోలేదు.

అందుకే —

'ఈసారి ఎవర్ని బలి యివ్వాలి?' — అని ఆలోచిస్తూ అమ్మవారి జాతర జరపడానికే నిశ్చయించారు. సన్నాహాలు మొదలెట్టడానికి లేచారు.

రహస్యంగా — బలి కోసం మనిషిని వెతకడం - ప్రారంభించారు.

1971

—